సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024

పోరాటాల గడ్డ రాయికోడ్

రాయికోడ్(అందోల్): తెలంగాణ సాయుధ పోరాటంలో రాయికోడ్ వాసులు భాగస్వాములయ్యారు. పోరాటానికి మద్దతుగా కొనసాగిన ఆర్యసమాజ్ వారి ర్యాలీని గ్రామానికి ఆహ్వానించారు. నిజాం సర్కారు ర్యాలీకి అనుమతిని ఇవ్వలేదు. సర్కారు ఆదేశాలను పట్టించుకోకుండా కాలిన కడుపులు, మండుతున్న గుండెలతో తెగింపునకు సిద్ధమై ర్యాలీ కొనసాగించారు. ర్యాలీ గ్రామంలోని గౌని ప్రాంతానికి చేరుకోగానే ఉద్యమకారులు, రజాకార్లకు మధ్య ఘర్షణ జరిగింది. సాయుధులైన రజాకార్ల మూక ర్యాలీపై కాల్పులకు తెగబడి 14 మందిని పొట్టనపెట్టుకున్నారు. ర్యాలీలోని 8 మందికి నిజాం ప్రభుత్వం జైలు శిక్ష విధించారు. అనంతరం రజాకార్లు రెచ్చిపోయి గ్రామంలోని ఇళ్లలో ఉన్న ధనం, ధాన్యాన్ని లూటీ చేశారు. ఇళ్లకు నిప్పంటించారు. అసువులు బాసిన ఉద్యమ కారులు, జ్ఞాపకాలు గ్రామస్తుల మదిలో ఇప్పటికీ మెదులుతూనే ఉన్నాయి.



కాల్పులు జరిగిన గౌని ప్రాంతం

ఆజాద్ హైదరాబాద్

జిల్లా వ్యవసాయాధికారితో నేడు 'సాక్షి' ఫోన్‌ఇన్

సంగారెడ్డి జోన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వాటిని కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు, సలహాలు, సూచనలు తీసుకోవడానికి మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌కి నేరుగా ఫోన్ చేసి పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవచ్చు.



శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, సంగారెడ్డి

తేది: 17-09-2024

సమయం: మధ్యాహ్నం 2గంటల నుంచి 3:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :

7288894403, 9505872923

నెత్తురు చిందిన గడ్డ.. పోరాటాల అడ్డా

బ్రిటీష్ వారిని తరిమిన భారతావనిలో ప్రజలు స్వాతంత్య్ర సంబరాలు చేసుకుంటున్నా.. హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలో బిక్కు బిక్కుమంటూనే గడిపింది. ఏడాది పాటు నియంతృత్వాన్ని, దుర్మార్గాలను భరిస్తూ వచ్చింది. ధూల్మిట్ట మండలం బైరాన్‌పల్లిలో జరిగిన నరమేధం కలకలం రేపింది. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసుకోవాలన్న ఒత్తిడి తీవ్రస్థాయికి చేరింది. 1948 ఆగస్టు 27న బైరాన్‌పల్లి ఘటన జరిగితే తర్వాత 21 రోజుల్లోనే.. అంటే సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. బైరాన్‌పల్లి అమరుల త్యాగానికి 76ఏళ్లు గడిచాయి.

- నెత్తుటి గాథకు నేటికీ 76 ఏళ్లు
- రజాకార్ల దుశ్చర్యలకు ఎదురొడ్డిన గ్రామం
- రజాకార్ల దాడుల్లో 118 మందికి పైగా మృతి
- ఈ ఘటన తర్వాతే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం
- అంతటి ఘన చరిత్ర కలిగిన గ్రామంపై పాలకుల చిన్నచూపు
- ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరుతున్న సమరయోధులు, గ్రామస్తులు

వీరుల పల్లె.. బైరాన్‌పల్లి



బైరాన్‌పల్లి బురుజుపై దాడి ఊహాచిత్రం (ఫైల్)

సాక్షి, సిద్దిపేట/మద్దూరు(హుస్నాబాద్): స్వాతంత్య్రం వచ్చి సమయంలో నిజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడానికి నిరాకరించారు. దీనికి తోడు నిజాం సైన్యాధ్యక్షుడు ఖాసీం రజ్వీ వ్యక్తిగత సైన్యం రజాకార్ల అరాచకాలు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం మొదలైంది. ధూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి కేంద్రంగా కూటిగల్, లింగాపూర్, ధూల్మిట్ట గ్రామాల యువకులు బలమైన గ్రామ రక్షక దళం ఏర్పడింది. గ్రామాన్ని రక్షించుకోడానికి ఐక్యంగా రజాకార్ల నుంచి తమ గ్రామాన్ని రక్షించుకోవాలన్న లక్ష్యంతో బైరాన్‌పల్లి గ్రామస్తులంతా ఏకమయ్యారు. శత్రువులపై దాడి చేయడానికి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న కోట బురుజును పునర్నిర్మించారు. నాటు తుపాకులు, మందు గుండు సామగ్రి సమకూర్చుకున్నారు. ఆయుధ శిక్షణ తీసుకున్న యువకులు.. నాటు తుపాకులతో గస్తీ నిర్వహించేవారు.


నాటి భువనగిరి డిప్యూటీ కలెక్టర్ హాషీం ఆదేశాలతో హైదరాబాద్ నుంచి 500 మంది సైనికులను రప్పించి మూడో సారి దాడి చేశారు. ఖాసీంరజ్వీ నేతృత్వంలో రజాకార్లు 1948 ఆగస్టు 27న తెల్లవారుజామున ఊరంతా నిద్రిస్తున్న వేళ ఒక్కసారిగా చుట్టుముట్టారు. అయితే ఆ సమయంలో బహిర్భూమికి వెళ్లిన గ్రామస్తుడు వడ్లె వెంకటనర్సయ్య గమనించి ఒక్కసారిగా కేకలు వేయడంతో వెంటనే బురుజు పై ఉన్న కాపలాదారులు నగారా మోగించారు. అప్పటికే దూసుకొచ్చిన రజాకార్ల కాల్పులతో బురుజుపై గెరిల్లా దళ సభ్యుడు రామయ్య, పోచయ్య, భూమయ్యలు మృతిచెందారు. బురుజుపై తలదాచుకున్న 40 మందిని అతి కిరాతకంగా కాల్చి చంపారు. మరో 56 మంది యువకులను బంధించి ఊరి బయటకు తీసుకొచ్చి కాల్చిచంపి మృతదేహాలను పాత బావిలో పడేశారు. కూటిగల్‌లోనే 22 మందిని కాల్చి చంపారు. ఈ మూడు దాడుల్లో 118 మందికి పైగా మృతిచెందినట్లు చరిత్ర చెబుతోంది. మహిళలను నగ్నంగా ఆ శవాల చుట్టూ బతుకమ్మ ఆడించారు. వారిపై అత్యాచారాలు చేశారు. రజాకార్ల చిత్ర హింసలు తట్టుకోలేక కొందరు స్త్రీలు ఆత్మహత్య చేసుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. బైరాన్‌పల్లి నరమేధం.. భారత ప్రభుత్వం దృష్టికి చేరడంతో.. నాటి హోం మంత్రి వల్లభాయి పటేల్ పోలీస్ యాక్షన్‌కు రంగం సిద్ధం చేశారు. ఈ ఘటన జరిగిన 21 రోజుల్లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో వీలినమైంది. నాటి ఘటనలు గుర్తు చేసుకుని ఇప్పటికీ కన్నీటి పర్యంతం అవుతున్నారు.

రజాకార్లను తరిమికొట్టిన సైన్యం

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దులో కర్ణాటకలోని బొంగూరు గ్రామం వద్ద సైన్యాన్ని రజాకార్లు అడ్డుకున్నట్లు పెద్దలు చెప్పినట్లు సమీప గ్రామాల ప్రజలు చెబుతుంటారు. 1948 సెప్టెంబర్ 13నుంచి 17 వరకు భారత సైన్యం మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో కర్ణాటకలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ తాలూకా బొంగూర్ గ్రామంలో 65వ జాతీయ రహదారిపై నల్ల రాళ్లతో నిర్మించిన బ్రిడ్జిపై రజాకార్లు అడ్డుకున్నారు. ఇందుకు ప్రతిగా స్పందించిన భారత సైన్యం ఎదురు దాడికి దిగడంతో రజాకార్లు తోక ముడిచి పారిపోయారు. ఇదిలాఉంటే భారత సైన్యం హైదరాబాద్ ప్రయాణిస్తూ మార్గమధ్యంలో కోహీర్ మండలం కవేలి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న ఎత్తైన ప్రదేశం నుంచి 7కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన కోహీర్ వైపు ఫిరంగులు పేల్చడంతో రజాకార్లు వెనుదిరిగి వెళ్లారు.

మూడు మార్లు దాడి

1948లో లింగాపూర్, ధూల్మిట్ట గ్రామాలపై దాడి చేసి తగులబెట్టారు. తిరిగి వెళ్తుండగా బైరాన్‌పల్లి సమీపంలోకి రాగానే వారిపై దూబూరి రాంరెడ్డి, ముకుందరెడ్డి, మురళీధర్ రావు నాయకత్వంలో రక్షణ గెరిల్లా దళాలు దాడి చేసి దోచుకున్న సంపదను స్వాధీనం చేసుకున్నారు. తిరిగి దానిని ప్రజలకు పంచిపెట్టారు. దీంతో ప్రతీకారేచ్ఛతో రజాకార్లు గ్రామంపై దాడి చేశారు. రక్షక దళం గట్టిగా ప్రతిఘటించింది. ఈ దాడిలో 20 మందికి పైగా రజాకార్లు చనిపోయారు. ఇలా రెండో సారి విఫలమైంది.



బైరాన్‌పల్లిలోని బురుజు

ప్రభుత్వాలు చిన్నచూపు

నాటి నుంచి బైరాన్‌పల్లి.. వీర బైరాన్‌పల్లి అయింది. ఇంతటి పోరాట పటిమ చూపిన తమను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని సమరయోధులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు గ్రామంలోని ప్రతి కుటుంబం నాటి పోరాటంలో భాగస్వామ్యం అవగా.. కేవలం 28 మందికి మాత్రమే పెన్షన్ మంజూరు చేశారు. నాడు పోరాటంలో పాల్గొని పెన్షన్ రానీ వాళ్లు ఇంకా 30 మంది వరకు ఉన్నారు. కూటిగల్లులోనూ ఇదే పరిస్థితి. నాడు అమరులైన వారి పేర్లతో గ్రామస్తులే ఓ స్తూపాన్ని నిర్మించుకున్నారు. 2003లో సీఎల్పీ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా స్తూపంను ఆవిష్కరించారు. రాబోయే భావితరాలకు బైరాన్‌పల్లి గురించి తెలిసేందుకు ప్రభుత్వం 10 గుంటల స్థలంలో అమరధామం, ఎత్తయిన స్తూపం, భవనం నిర్మించాలని, పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా స్త్రీల మైత్రి ఆరాధన



కొన్యాల చర్చిలో ప్రార్థనలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కొన్యాల చర్చిలో సోమవారం స్త్రీల మైత్రి ఆరాధన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ ఇండియా సంఘం మెదక్ అధ్యక్ష మండలం నూతనంగా ఏర్పాటు చేయబడిన పాస్టరేట్ కొన్యాల గ్రామంలో చిట్కుల్, కాసాల, పాస్టరేట్ గురువులు రెవ అమృతయ్య, రెవ కాంతారావు. రెవ సామెల్ గురువుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపించారు. కార్యక్రమంలో బి.మనోహర్, పి సుధాకర్, జి వీరయ్య, బి.అనంతరావు, ఎం.నర్సింలు, కే.ప్రభు, ఏసు, మోహన్, వెంకటయ్య, దేవరాజ్, పద్మారావు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

జహీరాబాద్ టౌన్: గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అల్గోల్ గ్రామ ఆటోడ్రైవర్లు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. దెబ్బతిన్న రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెట్టి డ్రైవర్లు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ నుంచి అల్గోల్ గ్రామం వరకు 10 కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరు అయినా ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

నారాయణఖేడ్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఖేడ్ డివిజన్‌లో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామంలో మసీదు వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మసీద్ వద్ద ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్‌రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ చైర్మన్ అబ్దుల్ రహీం, ముస్లీం పెద్దలు ఇబ్రహీం సాబ్, మహమూద్ మియా, హుస్సేన్ సాబ్, మహబూబ్, యువకులు సమీయొద్దీన్, మైపుజ్, మన్సూర్, సలావుద్దీన్, జమాల్, సాబేర్, కైఫ్, ముస్సవీర్ అలీ, తాహెర్, జుబార్, ఇర్ఫాన్, ఫర్హాన్, అబుబక్కర్ సిద్దిక్, మౌలానా, గౌస్ పాల్గొన్నారు.

లాభాల నివేదిక ఇవ్వండి..!

- భారీ పరిశ్రమల యాజమాన్యాలను కోరిన అధికారులు
- సీఎస్ఆర్ నిధుల లెక్క తేల్చేందుకు చర్యలు
- నిధుల ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పరిశ్రమలు ఆర్జిస్తున్న లాభాల నుంచి రెండు శాతం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలి. ఈ నిధుల లెక్క తేల్చేందుకు జిల్లాలోని పరిశ్రమలు ఆర్జించిన లాభాల నివేదికలు ఇవ్వాలని జిల్లా అధికార యంత్రాంగం యాజమాన్యాలను కోరింది. ఎంత మొత్తంలో లాభాలను ఆర్జించారు. అందులో సీఎస్ఆర్ కింద ఎంత మొత్తంలో ఖర్చు చేయనున్నారనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే సుమారు 40 వరకు భారీ పరిశ్రమల యాజమాన్యాల నుంచి లాభాల నివేదికలను తీసుకున్నారు. మిగిలిన వాటి నుంచి కూడా ఈ నివేదికలు అందగానే సీఎస్ఆర్ నిధుల విషయంలో ఓ స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఏటా రూ.ఐదు కోట్లు అంతకంటే ఎక్కువ లాభాలను ఆర్జించే పరిశ్రమలు ఈ సీఎస్ఆర్ కింద నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది.

పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి కోసం..

సీఎస్ఆర్ నిధులను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సర్కార్ దవాఖానాల్లో మౌలిక సదుపాయాల కల్పించేందుకు వినియోగిస్తారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, టాయిలెట్లు, ఇతర నిర్మాణాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లోనూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. వైద్యపరికరాల కొనుగోలుకు ఈ నిధులను వెచ్చించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నారు.

వందకు పైగా భారీ పరిశ్రమలు

పారిశ్రామికంగా రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్న సంగారెడ్డి జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో వందకు పైగా భారీ పరిశ్రమలు ఉన్నాయి. మల్టీనేషనల్ కంపెనీలకు చెందిన పరిశ్రమల యూనిట్లు ఇక్కడ తమ యూనిట్లను నెలకొల్పి రూ.వేల కోట్లు విలువ చేసే ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. ప్రధానంగా బల్క్ డ్రగ్స్, ఫార్మా, ఇంజనీరింగ్, ఆటోమొబైల్ తదితర పరిశ్రమలు ఇక్కడి వనరులను వినియోగించి రూ.కోట్లలో లాభాలను ఆర్జిస్తున్నాయి. కంపెనీ చట్టంలో ఉన్న నిబంధనల మేరకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులను సమాజ అభివృద్ధి కోసం నేరుగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

వనరులు ఇక్కడివి.. నిధుల ఖర్చు మరోచోట..

పరిశ్రమలు తమ సీఎస్ఆర్ నిధులను ఎక్కడైనా ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. దీంతో జిల్లాలో పరిశ్రమలు నడుపుతున్న కొన్ని యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులను స్థానికంగా వినియోగించకుండా మరోచోట ఖర్చు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజాప్రతినిధులు, నేతలు ఈ పరిశ్రమల యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి వారికి అవసరం ఉన్న ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయిస్తున్నారు. దీంతో ఈ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో స్థానికులు అన్ని రకాలుగా నష్టపోతుంటే.. ఈ పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను మాత్రం మరోచోటికి తరలించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈసారి జిల్లాలోని పరిశ్రమలకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మంత్రి సమీక్ష..

సీఎస్ఆర్ నిధుల విషయంలో మంత్రి దామోదర రాజనర్సింహ తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నిధులను జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇందులో భాగంగానే అధికారులు కంపెనీలకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులకు సంబంధించిన నివేదికలను కోరుతున్నారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలో నిర్వహించే స్వచ్ఛత హీ సేవా 2024లో ప్రతీ ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ, మానవహారాల ఏర్పాటు, గ్రామసభ నిర్వహణ, తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం, విద్యార్థులకు స్వచ్ఛత కార్యక్రమాలపై వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించడం, ఇంటింటికీ తిరిగి స్వచ్ఛత కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, స్వచ్ఛతరన్ యువజన సంఘాల సమావేశాలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంగీతం, పాటలు, డ్రాయింగ్, వాల్ పెయింటింగ్ పోటీలు, సంప్రదాయ నృత్య ప్రదర్శన, వ్యాస రచన, చేతివృత్తుల ప్రదర్శన, సంప్రదాయ ఆటల పోటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల విజయవంతానికి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దేశ రాజకీయాలకు మార్క్సిస్టు పార్టీ దిక్సూచి అని, తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో కమ్యూనిస్టులు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. జాగిర్దారులు, భూస్వాముల వద్ద ఉన్న లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రాంతంలో 4 వేల మంది ప్రాణాలను బలిదానం చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి పెట్టారని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ సాయుధ పోరాటాన్ని వక్రీకరించే దుర్మార్గమైన పద్ధతికి ఒడిగట్టిందన్నారు. సాయుధ పోరాటం హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, ప్రవీణ్, యాదగిరి, యాదవ రెడ్డి పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్లు వర్గల్ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. పాలనాపరమైన కారణాల దృష్ట్యా నవోదయ విద్యాలయ సమితి ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి మెదక్‌జిల్లాలోని అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధికారం పోయినా హరీశ్‌కు తగ్గని అహం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: అధికారం పోయినా బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావుకు అహంకారం తగ్గలేదని, సీఎం తోపాటు నూతన పీసీసీ అధ్యక్షుడిపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీసీలను అవమానించే విధంగా ఉన్నాయని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరొకసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని, అదొక దిక్కుమాలిన పార్టీ అని హరీశ్ మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, నాయకులు ప్రకాష్, సాయిలు ముదిరాజ్, కొండలు, అక్షిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 1200మంది పోలీసులతో బందోబస్తు

సంగారెడ్డి జోన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 11 రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణపయ్య గంగమ్మ ఒడికి చేరుకోనున్నాడు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 1400కు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో ఇప్పటికే కొన్ని విగ్రహాల నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


సంగారెడ్డిలో శోభాయాత్ర జరిగే రహదారి నుంచి మహబూబాబాద్ చెరువు వరకు విద్యుత్ దీపాలలు, బారికేడ్లు, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. క్రేన్లు అందుబాటులో ఉంచారు. చెరువుల పరిసరాల్లో గజ ఈతగాళ్ల సిద్ధంగా ఉంచారు.

బందోబస్తుకు స్పెషల్ టీమ్స్

నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెన్నూరు రూపేష్ తెలిపారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.



మహబూబ్ సాగర్ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గ్రిల్స్



కట్టపై విద్యుత్ లైట్లు



మహబూబ్ సాగర్ చెరువు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీలకు విద్యార్థి ఎంపిక


సాయికిరణ్

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్ విద్యార్థి సాయికిరణ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. సిద్దిపేట అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో 15న సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్–18 బాలుర విభాగం జిల్లా స్థాయి షాట్ పుట్ పోటీలను నిర్వహించారు. ఇందులో సాయికిరణ్ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. 19, 20 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతాయన్నారు. ఈ ఎంపికపై అసోసియేషన్ సభ్యులు సాయికిరణ్‌ను అభినందిస్తూ శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


వర్ష (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): అనారోగ్యంతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సర్దన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పిల్లి భాగ్య, కృష్ణల కుమార్తె వర్ష(15) సర్దన జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. వర్ష అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు శనివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. వర్ష ఇటీవలె క్లాసికల్ డ్యాన్స్‌లో నిర్వహించిన కళాత్సవ్‌లో మంచి ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర స్థాయిలో పేరు సంపాదించింది. అన్నింటిలో ముందుండే విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందడం తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను కలచివేసింది.

మూత్రవిర్జనకు వెళ్లి వ్యక్తి..


వీరన్న (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మురికి కాల్వలో పడి మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని రోళ్లపాడ్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల వీరన్న(45) ఆదివారం రాత్రి మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇంటి పక్కన ఉన్న మురికి కాల్వలో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాల్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


– పరారీలో మరో నలుగురు


నిందితుడు హరి

జహీరాబాద్ టౌన్: ముఠాగా ఏర్పడి గంజాయి అమ్ముతున్న వారిపై పోలీసులు దాడి చేయగా ఒకరు పట్టుబడ్డారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు.. జహీరాబాద్ మండలం శేఖాపూర్ తండాకు చెందిన హరి రాథోడ్, అర్జున్ చౌవాన్, విజయ్ చౌవాన్, వేణు పవార్, సతీష్ చౌవాన్ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారు. ఒరిస్సా బోర్డర్‌లోని కొత్తగూడెం నుంచి గంజాయిని తీసుకొచ్చి జహీరాబాద్ సరిహద్దులో గల కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణంలో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్ముతున్నారు. సోమవారం హుగ్గెల్లి గ్రామ సమీపంలో గల షాలీమార్ హోటల్ సమీపంలో శిరీష వెంచర్‌లో వీరు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చింది. దాడి చేసి హరి రాథోడ్ పట్టుకోగా అతడి వద్ద 5 కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశామని ఎస్‌ఐ వివరించారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.


సంగారెడ్డి కలబ్ గూరు శివారులోని మంజీరా డ్యాం


కొత్త బ్రిడ్జి వద్ద మంజీరా ప్రవాహం


అందంగా కనిపిస్తున్న పాత వంతెన

మంజీరా.. అందాలు చూడతరమా

ఇటీవల కురిసిన వర్షాలకు, ఎగువన నుంచి వచ్చిన నీటితో మంజీరా కొత్త అందాన్ని సంతరించుకుంది. డ్యామ్ నిండుకుండలా మారింది. నీళ్లు దిగువకు వెళ్తుండటంతో ఫసల్ వాది, శివ్వంపేట బ్రిడ్జి వద్ద నది కాల్వలు, ఏరులు నిండుగా కనిపిస్తున్నాయి. వర్షాలు తగ్గటంతో జనం మంజీరా అందాలు చూస్తూ ఆనందిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

స్త్రీ నిధి.. మహిళల పెన్నిధి

- రుణాలతో పెరటి కోళ్ల పెంపకం
- ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికంగా ఎదుగుదల
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- నాటు కోడికి మార్కెట్‌లోనూ డిమాండ్



సంగారెడ్డి టౌన్: మహిళల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తుంది. అందులో భాగంగానే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, సాధికారతే లక్ష్యంగా పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు అందిస్తూ వ్యాపారులుగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తుంది. స్త్రీ నిధి రుణాల ద్వారా పెరటి కోళ్ల పెంపకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తూ గుడ్లు, మాంసంతో పోష్టికాహారం అందించేలా శిక్షణ కల్పిస్తుంది. నాటు కోళ్ల అధిక ధరలు ఉండడంతో మహిళలకు ఇంటి వద్ద నుంచి మంచి ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో యూనిట్ల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి అవకాశాలు కల్పిస్తుంది. జిల్లాలో మొత్తం మహిళా సంఘాలు 18,756 ఉండగా అందులో 1,90,381 లక్షల సభ్యులు ఉన్నారు.

పెరట్లో పెంపకం..

పెరటి కోళ్ల పెంపకం చేపడితే ప్రత్యేకంగా దాణా వేయాల్సిన అవసరం లేదు. తృణ ధాన్యాలు, గడ్డి గింజలు, కీటకాలు, చెదలు, వానపాములను తింటాయి. మందులు వాడాల్సిన అవసరం ఉండదు. జిల్లాలో మండలానికి ఒక మదర్ యూనిట్ చొప్పున 25 యూనిట్లు అందిస్తున్నారు. మదర్ యూనిట్లలో నాటు కోడి, గుడ్లు పిల్లలను ఉత్పత్తి చేసి పెంపకాన్ని పెంచుతాయి. నాటు కోళ్లకు మార్కెట్‌లో మంచి ధరలు ఉండడంతో మహిళలకు మంచి ఆదాయం సమకూరుతుంది. పశుసంవర్థక శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో కోళ్ల సంఖ్య 6 లక్షల వరకు ఉంది. డిమాండ్ మేరా కోడి మాంసం, గుడ్లను అందించలేకపోతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్నారు.

మేలు జాతి రకమే పెంపకం..

రాజశ్రీ, గ్రామ ప్రియ, కృషి బ్రో, రైన్ బో రోస్టర్, వనరాజా, శ్రీనిధి గిరిరాజ, యాసిడ్, కడకనాథ్ వంటి మేలు జాతి రకాలు అందిస్తారు. అందుబాటులో లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించే ప్రయత్నం చేస్తారు. స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాన్ని అందిస్తారు. నాటు కోళ్లకు మంచి డిమాండ్ ఉంది. పల్లెటూర్లలో నాటు కోళ్ల పెంచడంతో వాటిని విక్రయాల కోసం పట్టణాలకు పంపిస్తూ ఉంటారు. పిల్లలను 45 రోజులయ్యాక 350 గ్రాముల బరువు పెరిగిన తర్వాత విక్రయిస్తారు. వీటిని పెరట్లో వ్యవసాయ క్షేత్రాలలో పెంచుకోవచ్చు.

యూనిట్ల కేటాయింపు..

100 కోళ్ల యూనిట్లు (46 వారాల కోళ్లు) కొనుగోలు పోషణకు రూ.22,000 రుణంగా అందిస్తారు. 50 కోళ్ల యూనిట్‌కు రూ.12,500 రుణమిస్తారు. వార్షిక వడ్డీ 11 శాతంతో కలిపి 24 నెలల వాయిదాల్లో తిరిగి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క యూనిట్ విలువ రూ.2.91 లక్షలు ఉంటుంది. నెలకు రూ.6,400 చొప్పున 60 నెలసరి వాయిదాల్లో రుణాన్ని తిరిగి చెల్లిస్తారు.

ఇంటి నుంచే ఆదాయం



మాది గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామం. మహిళా సంఘం సభ్యురాలిగా నాటు కోళ్ల పెంపకాన్ని ఇంటి వద్ద నుంచి చేపడుతూ మంచి ఆదాయాన్ని పొందుతున్నాను. రూ.20 చొప్పున 50 కోళ్లను తెచ్చుకొని 40 రోజులపాటు పెంచుతూ విక్రయాలు చేసస్తున్నాను. ఇంటి నుండే మంచి ఆదాయం సమకూరుతుంది.
– అర్చన, లబ్ధిదారు

ఖర్చు తక్కువే..



మాది అందోల్ మండలం తలేల్మా గ్రామం. స్త్రీనిధి ద్వారా కోళ్లను తీసుకొని వాటిని ఇంటి పెరట్లో పెంచుతున్నాను. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం సంపాదిస్తున్నాను. గుడ్లు, కోళ్ల మంచి ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను. ఒక కోడికి రూ.110 ఖర్చు పెడితే రూ.550 వరకు లాభం వస్తుంది.
– మంజుల, లబ్ధిదారు

ముందుగా శిక్షణ ఇస్తాం



పెరటి కోళ్ల పెంపకాన్ని ఇస్తున్న రుణ సదుపాయాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కోళ్ల పెంపకంతో ఇంటిల్లిపాదికి పౌష్టికాహారం అందుతుంది. ఇంటి అవసరాలు పోను మిగిలిన గుడ్లు, కోళ్ల విక్రయాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. పెరటి కోళ్ల పెంపకంలో ఆసక్తి ఉన్న మహిళలకు ముందుగా శిక్షణ కల్పిస్తాం. రుణాలను అందించి వారికి ప్రోత్సహిస్తాం.
– జంగారెడ్డి, అదనపు డీఆర్డీఓ

అయ్యో పాపం 'వెంకటస్వామి'

- గుండెపోటుతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు మృతి
- బదిలీపై కొత్త పాఠశాలకు వెళ్లిన రెండు రోజులకే తీవ్ర విషాదం


వెంకటస్వామి (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): బదిలీ అయ్యి పాఠశాలలో విద్యార్థులకు పరిచయం కాకముందే ఆ ఉపాధ్యాయుడిని విధి కాటేసింది. ఇంటి వద్ద కాలకృత్యాలకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాదకరమైన ఘటన మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ధ్యాప వెంకటస్వామి(42), మంజుల (ఉపాధ్యాయురాలు), ఇద్దరు కుమార్తెలు సుష్మిత మిత్ర, అక్షర మిత్ర ఉన్నారు. వెంకటస్వామి గజ్వేల్ మోడల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా 11 ఏళ్లుగా పని చేస్తున్నాడు. భార్య మంజుల జగదేవ్‌పూర్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. అలిరాజ్‌పేట గ్రామం నుంచి గజ్వేల్‌కు మారి నూతనంగా ఇల్లు నిర్మించుకొని గత నెల 23న గృహ ప్రవేశం చేశారు. ఈ నెల 14న ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా గజ్వేల్ నుంచి జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. అదే రోజు సాయంత్రం పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం గజ్వేల్‌లోని కొత్త ఇంటిలో కాలకృత్యాలకు వెళ్లగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

సామాజిక కార్యక్రమాలు..

వెంకటస్వామి ఉపాధ్యాయుడికి ముందు సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. సామాజిక పాటలపై ప్రేమతో 11 పాటలను సొంత ఖర్చులు, దర్శకత్వంతో తీశారు. గ్రామానికి చెందిన పల్లెటూరి హీరో అనిల్ మొగిలితో 7 పాటలకు దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరించారు. అలాగే రైతుల ఆత్మహత్యలపై పాటలకు నిర్మాత, దర్శకత్వం వహించారు.

నేత్రదానం..

వెంకటస్వామి మృతి చెందిన వెంటనే లోక్ నేత్ర ట్రస్టు వారికి అతడి కళ్లను దానం చేశారు. నేత్రదానం చేసి మరొకరికి చూపు ఇవ్వడంతో గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు ఆ కుటుంబాన్ని అభినందించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నేతలు శంకర్, సత్తయ్య, ప్రవీణ్, వెంకట్ కిరణ్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో మునిగి వ్యక్తి మృతి
- సదాశివపేట మండలంలో ఘటన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి సీ.చెందిన తెలుగు సత్తయ్య(37) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలో ప్రతిష్ఠించిన గణపతిని నిమజ్జనం చేసేందుకు గ్రామ శివారులోని కందకుంట చెరువుకు తోటి మండప సభ్యులతో కలిసి వెళ్లాడు. వినాయకుడిని పట్టుకొని అందరితో పాటు చెరువులోకి దిగిన సత్తయ్య ప్రమాదవశాత్తు నీటిలోకి జారి మునిగిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించి సోమవారం ఉదయం మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో గల్ఫ్ బాధితుడు ఆత్మహత్య


ముత్తయ్య మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): అప్పుల బాధతో గల్ఫ్ బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఏనుగుల ముత్తయ్య(33) ఉపాధి కోసం రెండుసార్లు గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. అక్కడ సరిగ్గా పని దొరక్కపోవడంతో తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటూ కూలీ పని చేస్తున్నాడు. గల్ఫ్‌కు వెళ్లడానికి దాదాపు రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురైన ముత్తయ్య సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామానికి వచ్చాడు. గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం


బస్సును అడ్డుకున్న మహిళ

జహీరాబాద్ టౌన్: మద్యం మత్తులో ఓ మహిళ నడిరోడ్డుపై వీరంగం సృష్టించింది. ఈ ఘటన పట్టణంలోని ప్రధాన రహదారి భవానీ మందిర చౌరస్తాలో సోమవారం చోటు చేసుకుంది. గుర్తు తెలియని మహిళ అతిగా మద్యం సేవించి అదే మత్తులో రోడ్డుపై నడుస్తుంది. రాకపోకలు సాగిస్తున్న వారిపై దురుసుగా ప్రవర్తించింది. జహీరాబాద్ నుంచి తాండూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి చెప్పుతో దాడికి యత్నించింది. బస్సు ముందుకు కదలకుండా అడ్డంగా నిల్చుని బూతులు మాట్లాడింది. సుమారు 30 నిమిషాలు బస్సును కదలనీయకుండా హంగామా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. కొంత మంది ముందుకొచ్చి ఆమెను రోడ్డు పక్కకు తీసుకెళ్లడంతో బస్సు వెళ్లిపోయింది.

అనారోగ్యంతో భర్త.. తట్టుకోలేక భార్య

తొమ్మిది రోజుల వ్యవధిలో దంపతుల మృతి


జగ్గవ్వ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): భర్త మృతి తట్టుకోలేక భార్య కూడా అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామా నికి చెందిన బద్దం రాజిరెడ్డి అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో 8వ తేదీన ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మరణంతో మనోవేదనకు గురైన భార్య జగ్గవ్వ(65) సోమవారం అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే మృతి చెందింది. తొమ్మిది రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి


కనకయ్య(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆకునూరులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నీరేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన శెట్టి కనకయ్య(53) కొద్ది రోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. ఇంటి వద్ద ఏ పనిచేయకుండా ఉంటున్న కనకయ్య మనస్తాపం చెంది శనివారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యావపూర్‌లో యువకుడు


ప్రవీణ్ (ఫైల్)

తూప్రాన్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని యావపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం, గ్రామస్తుల కథనం మేరకు.. యావపూర్ గ్రామానికి చెందిన కొత్త ప్రవీణ్ (24) మూడు రోజుల కిందట గ్రామ సమీపంలో పురుగుల మందు సేవించాడు. ఇంట్లో తన చెల్లెలు రమ్యకు ఫోన్ చేసి ''నేను చనిపోతున్న, అమ్మను, నానమ్మను మంచిగా చూసుకో'' అని చెప్పాడు. వెంటనే గ్రామస్తుల సాయంతో ప్రవీణ్‌ను కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పంట పొలం ధ్వంసం


పొలాన్ని ధ్వంసం చేస్తున్న వాహనం

చిన్నశంకరంపేట(మెదక్): పచ్చని పంట పొలాన్ని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ధ్వంసం చేసిన ఘటన చిన్నశంకరంపేట మండలం కామారం తండాలో చోట చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారం తండాలకు చెందిన హలవాత్ లక్ష్మికి తాతకాలం నుంచి భూమి ఉంది. ఇదే భూమిలో వరి పంట వేశారు. ఈ భూమి పక్కన భూములను కొనుగోలు చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి లక్ష్మి భూమిపై కన్నేశాడు. ఇది తన పరిధిలోకి వస్తుందని ఎలాంటి సమాచారం లేకుండా జేసీబీతో పొలాన్ని ధ్వంసం చేయించాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారితో మాట్లాడి ఏదైనా సమస్య ఉంటే రెవెన్యూ సర్వే చేసిన తర్వాత స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈ విషయంపై బాధితులు లక్ష్మి భర్త రవి, కుమారుడు దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

జోగిపేట(అందోల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జోగిపేట ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర కబడ్డీ విభాగంలో మచ్చేందర్, గిరిధర్, అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో శ్రీకాంత్, అండర్ 17 ఖో ఖో పోటీల్లో దుర్గా ప్రసాద్ అండర్ 17 కబడ్డీ బాలికల విభాగంలో ఆసిఫా, అండర్ 14 వాలీబాల్ బాలికల విభాగంలో మధురిమ ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ దాసరి నాగేశ్వర్, ప్రిన్సిపాల్ డెలిఫిన్ లివర్, వ్యాయామ ఉపాధ్యాయులు నర్సింలు, జె. భానుతేజ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- కొండపోచమ్మ ఆలయం వద్ద అధ్వాన పరిస్థితులు
- కొత్తది నిర్మించినా వృథానే
- ఇబ్బందులు పడుతున్న భక్తులు


కొండపోచమ్మ వద్ద మురుగుతో నిండిన కాల్వ

జగదేవ్‌పూర్(గజ్వేల్): నిత్యం వందలాది మంది భక్తులతో కిటకిటలాడే ఆలయం వద్ద మురుగు కాల్వల దుస్థితి అస్తవ్యస్తంగా మారింది. పాత మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంతో నూతనంగా నిర్మించారు. కానీ మురుగు సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీంతో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన కొండపోచమ్మ ఆలయం ఉంది. ఏటా మూడు నెలల పాటు జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. నిత్యం వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. గత కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. రోడ్డు వెడల్పు చేపట్టి నూతన కాల్వలు కట్టారు. ఇప్పుడు పాత మురుగు కాల్వలు రోడ్డు దిగువకు అయ్యి మురుగంతా నిల్వ ఉంటుంది. నూతనంగా నిర్మించిన కాల్వలోకి మురుగు పారడం లేదు. దీంతో నీరు నిలిచి కంపు కొట్టడంతో కొండపోచమ్మ ప్రజలు, భక్తులు పలు సార్లు అధికారులు దృష్టికి తీసుకుపోయారు. మరోసారి ఈజీఎస్ ద్వారా రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. 5 నెలల క్రితం సంబంధిత కాంట్రాక్టర్ సీసీ రోడ్డు కంటే ఎత్తుగా కాల్వల నిర్మాణం చేపట్టాడు. రోడ్డు పక్కన ఉన్న మురుగు కాల్వ కంటే వీటి ఎత్తు ఉంది. దీంతో మళ్లీ పాత సమస్యే పునరావృతం అవుతోంది. కాల్వలో నీరు పారుదల లేక ఎక్కడికక్కడే ఆగి దుర్వాసన వెదజల్లుతుందని భక్తులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోగాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి పంచాయతీ రాజ్ ఏఈ దేవయ్యను వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.